www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHI

Galaxy S25 Ultra
Galaxy AI

శుక్రవారం | 28-3-2025 | పేజీలు: 6 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 86 | శ్రీకాకుళం

Srikakulam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం,తిథి: చతుర్దశి రా.7.56 తదుపరి అమావాస్య, నక్షత్రం: పూర్వాభాద్ర రా.10.09 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: తె. ఉ. 7.45, అమృతఘడియలు: మ.2.57-4.23, దుర్ముహూర్తం: ఉ.8.41-9.30, మ.12.44-1.33, రాహుకాలం: ఉ. 10.30-12.00, సూర్యోదయం: 6.16, సూర్యాస్తమయం: 6.24


SAMSUNG
సరికొత్త
Galaxy A56 | A36 | A26 5G
Google
Add to your search
Cute knit essentials for the springtime
Awesome Intelligence
Best Face
Instant Slo-mo
Auto Trim
Circle to Search with Google
Awesome Intelligence
Now available in trendy colours
అద్భుతమైన ఆఫర్లు
8/256GB కోసం చెల్లించండి. పొందండి 12/256GB ₹3000^ విలువ గల ఆఫర్
లేదా
₹3000* వరకు బ్యాంక్ క్యాష్ బాక్
HDFC BANK
SBI card
+
స్క్రీన్ ప్రొటెక్షన్ @ ₹2999 ₹999*
Samsung Care+
+
18 నెలలు వరకు నో కాస్ట్ EMI**
Samsung Finance+
TVS CREDIT
samsung.com
దయచేసి ఇ-వేస్ట్ మరియు ప్లాస్టిక్ వేస్ట్‌లు బాధ్యతగా పడవేయండి. ఇ-వేస్ట్‌లు మరియు ప్లాస్టిక్ వేస్ట్‌ల పై సమాచారం కొరకు కస్టమర్లు 180057267864 పై WhatsApp చేయవచ్చు.
Scan for an awesome experience.
Or WhatsApp "Galaxy A" to 9870 494949 to buy now at Samsung Exclusive Store
Cheil-25291/25

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

30, 31 తేదీల్లో పనిచేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

విజయనగరం దాసన్నపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఈ నెల 30, 31 తేదీల్లో పనిచే స్తాయని జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రామలక్ష్మీ పట్నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపును పురస్కరించుకుని ఆది, సోమవారాల్లో పనిదినాలుగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవమికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

విజయనగరం రింగురోడ్డు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 5న విజయనగరం డిపో నుంచి భద్రాచలం వరకూ ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు డిపో మేనేజరు శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు ఏప్రిల్ 5న సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు భద్రాచలం చేరుకుంటాయని, 6న సాయంత్రం 5 గంటలకు భద్రాచలం నుంచి విజయనగరం తిరిగి బయలుదేరుతాయన్నారు. వివరాలకు 99592 25620 నెంబరును సంప్రదించాలని కోరారు.



ఫ్రీహోల్డ్ పనిపడుతున్నారు

- 15 ఎకరాలకు అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగినట్లు గుర్తింపు
- నోటీసుల జారీతో అక్రమార్కుల్లో గుబులు
- బయటపడని కీలక వ్యక్తుల పేర్లు
- ఫ్రీహోల్డ్ ప్రక్రియపైనా లోతుగా విచారణ
- ఇన్‌చార్జి మంత్రులకు బాధ్యతలు

● జిల్లాలో 15 ఎకరాల ఫ్రీహోల్డ్ భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించాం. వారికి నోటీసులు పంపించాం.

-మూడు రోజుల క్రితం గంట్యాడ విలేకర్ల సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

● వేపాడలో 100.55 ఎకరాలు, రామభద్రపురం 33.88 ఎకరాలు, భోగాపురం 19.6 ఎకరాలు, విజయనగరం 11.56 ఎకరాలు, గజపతినగరం 6.11 ఎకరాలు, డెంకాడ 5.1 ఎకరాలు, గంట్యాడ 1.25 ఎకరాలు, దత్తిరాజేరు 0.36 ఎకరాలు, మెరకముడదాం 1 ఎకరా.

-ఇవీ మండలాల వారీగా రిజిస్ట్రేషన్లు జరిగిన ఫ్రీహోల్డ్ భూములు

శృంగవరపుకోట, మార్చి27 (ఆంధ్రజ్యోతి):

రెండు దశాబ్దాలు దాటిన అసైన్డ్ భూములకు గత వైసీపీ ప్రభుత్వం చట్టబద్ధత కల్పించిన సంగతి తెలిసిందే. జిల్లాలో 7490.62 ఎకరాలకు యాజమాన్య హక్కు (ఫ్రీహోల్డ్) కల్పించారు. ఇలా ఫ్రీహోల్డ్ జరిగిన వెనువెంటనే తొమ్మిది మండలాల్లో 179.41 ఎకరాల భూములకు రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. ఈ వ్యవహారం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ప్రస్తుత ప్రభుత్వం భావించడంతో విచారణకు ఆదేశించింది. విచారణలో భాగంగా జిల్లాలో 15 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తేల్చారు. దీంతో వీటిని అక్రమ మార్గంలో పొందిన వారి గుండెలు గుబేల్ మంటున్నాయి. ఇప్పటికే వీరందరికి నోటీసులు జారీ చేసినట్లు మంత్రి కొండపల్లి తెలిపారు. అక్రమంగా జరిగిన ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేస్తారా? లేక ఈ భూములను తిరిగి నిషేధిత జాబితాలో చేరుస్తారా? అసైన్డ్ రైతుకు తిరిగి భూమిని అప్పగిస్తారా? ప్రభుత్వం స్వాధీనం చేసేసుకుంటుందా? అన్న చర్చ నడుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా క్రయ, విక్రయాలకు అవకాశం ఇచ్చిన అధికారులపై ఎటువంటి చర్యలు ఉంటాయన్న దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు.

కీలక బాధ్యులెవరో?

ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు రెవెన్యూ కార్యాలయాల పాత్ర ఉంది. వీరందరిలోనూ ఇప్పుడు ఆందోళన నెలకొంది. అయితే ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ తంతులో ఎన్ని ఎకరాల్లో అక్రమాలు జరిగాయన్నది మాత్రమే బయటకు చెబుతున్నారు. నోటీస్‌లు పంపించామంటున్నారు తప్ప బాధ్యుల పేర్లు ఇంకా బయటపెట్టలేదు.

ఫ్రీహోల్డ్‌పైనా అనుమానాలు..

ఫ్రీహోల్డ్ జరిగిన భూముల రిజిస్ట్రేషన్ల కంటే అసైన్డ్ భూములకు చట్టబద్ధత (ఫ్రీహోల్డ్) కల్పించిన తీరుపైనా ప్రస్తుత ప్రభుత్వానికి అనుమానాలు ఎక్కువగా ఉన్నాయి. నిజంగా అసైన్డ్ భూములు కలిగిన అర్హులు ఎవరున్నారు? వాటిని ఫ్రీహోల్డ్ చేయడం వల్ల వారికే లబ్ధి చేకూరిందా? వారిని మభ్యపెట్టి ఎవరైనా భూములు కొని లబ్ధిపొందుతున్నారా? అన్న అంశాలన్నీ కూలంకషంగా పరిశీలించే బాధ్యతను జనవరి నెలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. ఇదెంతవరకు తేల్చారన్న విషయం బహిర్గతం కావడం లేదు.

పేదల భూముల్లో పెద్దల పాగా..

జిల్లాలో సగానికి పైబడి అసైన్డ్ భూములు ఇతరుల చేతుల్లో ఉన్నాయి. అప్పట్లో ఎకరా రూ.500 నుంచి రూ.1000కు అనధికారకంగా కొనుగోలు చేసిన వారున్నారు. ఈ అసైన్డ్ భూములు పొందిన వారంతా ఎస్సీ, ఎస్టీ, బీసీల్లోని పేదలు కావడంతో వారికి డబ్బు ఆశచూపి కొందరు పెద్దలు చేజిక్కించుకున్నారు. అయితే ఈ భూమును వ్యవసాయ భూములుగా మార్చుకునేందుకు ఖర్చుతో కూడిన పని కావడంతో చాలా మంది అలాగే వదిలేశారు. ఇలాంటి వారిని గుర్తించిన బడాబాబులు వీరి నుంచి తీసుకున్న భూముల్లో పలు రకా ల పండ్ల చెట్ల పెంపకం చేపట్టేందుకు తిరిగి వారినే కూలీలుగా మార్చారు. అధికారులు ఎవరైనా వస్తే తమ భూములుగా చెప్పేలా తర్ఫీదు ఇచ్చారు. రిజిస్ట్రేషన్‌లు చేసుకొనేందుకు (మిగతా 4వ పేజీలో..)



- కీలక నేతల రంగప్రవేశంతో ఊపందుకున్న మున్సిపల్ రాజకీయం
- అటు బొత్స, చిన్నశ్రీను, ఇటు నాయన సోదరులు
- తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం
- టీడీపీ, వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లలో ఉత్కంఠ

అవిశ్వాసం వైపుగా..



బొబ్బిలి, మార్చి 27(ఆంధ్రజ్యోతి):

బొబ్బిలి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే దిశగా పరిణామాలు జరుగుతున్నాయి. ఇప్పటికే దీనిపై బొబ్బిలి అంతా చర్చలు సాగుతున్నాయి. మాజీ మంత్రి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు మున్సిపల్ అవిశ్వాస తీర్మానంపై ఇటీవల తొలిసారిగా పెదవి విప్పడంతో వైసీపీ శిబిరంలో కలకలం రేగింది. అన్నకు మద్దతుగా ఎమ్మెల్యే బేబీనాయన కూడా ప్రకటించారు. దీంతో మున్సిపల్ రాజకీయం కాస్త వేడెక్కినట్లయింది. అన్నదమ్ములిద్దరూ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు మొగ్గుచూపినట్లు నిర్ధారణ కావడంతో తెలుగుదేశం శిబిరంలోనే కాకుండా వైసీపీలో ఉన్న అసమ్మతి వర్గంలోనూ జోష్ పెరిగింది.

సుజయ్ మాట్లాడాక మున్సిపల్ చైర్మన్ సావు హుటాహుటిన పక్కి గ్రామానికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత శంబంగి వెంకటచినఅప్పలనాయుడుతో మంతనాలు జరిపారని సమాచారం. ఎమ్మెల్సీ, మాజీ మంత్రి, వైసీపీకి పెద్ద దిక్కుగా ఉన్న బొత్స సత్యనారాయణ సైతం ఈ అంశంలో చాలా సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. వైసీపీలో ఉన్న అసమ్మతి కౌన్సిలర్లందరినీ తనతో ఫోన్‌లో మాట్లాడే ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. బుధవారం సాయంత్రం విజయనగరం జిల్లాపరిషత్ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిన్న శ్రీను దగ్గరికి వైసీపీ కౌన్సిలర్లు వెళ్లి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఆ సమావేశానికి గాని, మున్సిపల్ చైర్మన్ ప్రీ కౌన్సిల్ సమావేశానికి గాని అసమ్మతి వర్గీయులైన కౌన్సిలర్లు ఎవరూ హాజరు కాకపోవడం మరో ట్విస్టుగా పరిశీలకులు భావిస్తున్నారు.

● అసమ్మతి కౌన్సిలర్లను బుజ్జగించేందుకు మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణారావు, ఒకటో వార్డు కౌన్సిలర్ రమేష్‌నాయుడు తదితరులు గురువారం సాయంత్రం అసమ్మతి కౌన్సిలర్లను స్వయంగా కలిశారు. చైర్మన్‌పై అవిశ్వాసానికే తామంతా కట్టుబడి ఉన్నట్లు వారు స్పష్టం చేశారని తెలిసింది.

● అసమ్మతి వర్గంలో ఉన్న తొమ్మిది మంది వైసీపీ కౌన్సిలర్లలో కొంతమంది స్థానిక మాజీ ఎమ్మెల్యేకి అనుచరులు కాగా (మిగతా 4వ పేజీలో..)

పార్కింగ్ ఫీజుపై కట్టడి



- మల్టీప్లెక్స్‌లో తొలి అరగంట ఉచితం
- వచ్చేనెల ఒకటి నుంచి అమలు

విజయనగరం రింగురోడ్డు, మార్చి27(ఆంధ్రజ్యోతి):

మల్టీప్లెక్స్, షాపింగ్‌మాల్స్ పార్కింగ్ చార్జీలను కట్టడి చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇష్టానుసారం రుసుం వసూలు చేయకుండా అదుపు చేస్తూ కొత్త నిబంధన లను ఏప్రిల్ 1న అమలు చేయనుంది. నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లోనూ కొత్త విధానం అమలు కానుంది. ప్రధానంగా వాణిజ్య సముదాయాలు, మాల్స్, మల్టీప్లెక్స్‌లకు ఇది వర్తిస్తుంది. ప్రస్తుతం కారు లేదా బైకులను పార్క్ చేస్తే చార్జీల కింద రూ.50 నుంచి రూ.100 వసూలు చేస్తున్నారు. జిల్లాలో 10 వరకూ మాల్స్, మల్టీప్లెక్స్‌లు, సినిమా హాల్స్ ఉన్నాయి. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో చాలా మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది.

నిబంధనలు ఇవే..

● వాణిజ్య సముదాయాల్లో (మాల్స్, మల్టీప్లెక్స్)లో వస్తువులు కొనుగోలు చేసినట్టు బిల్లు చూపిస్తే 30 నిమిషాల నుంచి గంట వరకూ పార్కింగ్ ఫీజు వసూలు చేయరు.

● గంటకు పైగా పార్కింగ్ చేసినప్పుడు అక్కడ సినిమా టిక్కెట్ లేదా ఏదైనా వస్తువులు కొన్నప్పుడు పార్కింగ్ ఫీజు కంటే ఎక్కువ విలువైన వస్తువులు కొనుగోలు చేసినట్టు చూపిస్తే గంట కంటే ఎక్కువ సమయం వాహనాన్ని పార్కింగ్‌లో వుంచినా పార్కింగ్ ఫీజు మినహాయిస్తారు.

1వ తేదీ నుంచి అమలు: కమిషనర్ నల్లనయ్య

అన్ని మల్టీప్లెక్స్‌లు, మాల్స్, సినిమాహాల్స్‌లో ఏప్రిల్ 1 నుంచి పార్కింగ్ ఉచితం. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు వచ్చాయి. 30 నిమిషాల వరకూ ఇక్కడ పార్కింగ్ రుసుము పూర్తిగా ఉచితం. 30 నిమిషాల తరువాత బిల్లు చూపిస్తే పార్కింగ్ ఫీజు పూర్తిగా రద్దు చేయవచ్చు. ఇప్పటికే మల్టీప్లెక్స్ మాల్స్ యాజమాన్యాలతో పార్కింగ్ సంబంధించిన కొత్త ఉత్తర్వులపై అవగాహన కల్పిస్తున్నాం.

ఉగాది వేడుకలకు చురుగ్గా ఏర్పాట్లు

- సంప్రదాయాలు ఉట్టి పడాలన్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

విజయనగరం కలెక్టరేట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): విశ్వవసునామ సంవత్సర ఉగాది వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశించారు. నిర్వహణపై తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సూచనల మేరకు ఈనెల 30న ఉగాది వేడుకలను కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగువారి సంప్రదాయాలు ఉట్టిపడేలా మామిడాకుల తోరణాలు, అరటి చెట్లతో అలంకరణ చేయాలని సూచించారు. పంచాంగ శ్రవణం, వేదాశీర్వచనం, ప్రసాదాల ఏర్పాట్లను దేవదాయశాఖ చూడాలని ఆదేశించారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ ఉగాది పచ్చడిని పంపిణీ చేయాలన్నారు. వేదిక అలంకరణ బాధ్యతలను ఉద్యాన శాఖకు అప్పగించారు. సమీక్షలో సమాచార పౌర సంబంధాల శాఖ ఏడీ రమేష్, కలెక్టరేట్ ఏవో దేవి ప్రసాద్, పర్యాటక శాఖ అధికారి కుమారుస్వామి, తహసీల్దార్ కూర్మనాథ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

వేతనదారులకు వేసవి కష్టాలు

ఉపాధి హామీ కూలీలు ఎండ వేడికి ఆపసోపాలు పడుతున్నారు. పని ప్రదేశంలో నీడ లేక విలవిల్లాడుతున్నారు.చాలాచోట్ల వారికి తాగునీరు కూడా సరఫరా చేయడం లేదు. మరోవైపు ఉదయం 8 గంటల తర్వాత బయటకు రావడమే కష్టమవుతోంది. ఈ పరిస్థితిలో ఉపాధి కూలీలు ఎండ వేడికి చాలా ఇబ్బంది పడుతున్నారు. కనీస సౌకర్యాలు సమకూర్చాలని కోరుతున్నారు.

2



ఈ వీణ ఆనందరాగం పలికేనా?

2

- పనస కలప సమకూర్చాలని కార్మికుల డిమాండ్
- ఇతర రాష్ట్రాల నుంచైనా తెప్పించాలని విన్నపం
- తగ్గిపోయిన పంట

అవకతవకలు బట్టబయలు

- సోషల్ ఆడిట్ సాక్షిగా వెల్లడి
- ఇరిగేషన్ గోడకు బీటలు
- పూర్తికాని సచివాలయానికి బిల్లుల చెల్లింపులు
- మస్తర్లలోనూ మాయాజాలం
- పీడీకి నివేదిస్తా: ఏపీడీ పద్మజ

మెంటాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మెంటాడ మండల కేంద్రంలో గురువారం జరిగిన సామాజిక తనిఖీ కార్యక్రమం సాక్షిగా గత ప్రభుత్వ హయాంలో వివిధ పథకాల అమలులో చోటుచేసుకున్న అనేక అవకతవకలు, అక్రమాలు బట్టబయలయ్యాయి. డ్వామా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మజ ఆధ్వర్యంలో జరిగిన సోషల్ ఆడిట్‌లో ఇరిగేషన్, ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ తదితర పథకాల్లో డొల్లతనం బయటపడింది. కొంపంగి గ్రామంలో పట్నాయక్ చెరువు చుట్టూ దాదాపు ఐదులక్షలతో నిర్మించిన గోడ పూర్తిగా పగుళ్లు ఇచ్చిందని, పనుల్లో నాణ్యతా లోపం స్పష్టంగా కనిపిస్తోందని డీఆర్పీలు ఏపీడీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఏపీడీ విచారణ జరిపి చర్యలు (మిగతా 4వ పేజీలో..)



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

ఈ వీణ.. ఆనంద రాగం పలికేనా?

- పనస కలప సమకూర్చాలని కళాకారుల డిమాండ్
- ఇక్కడి పరిసర ప్రాంతాల్లో తగ్గిపోయిన పంట
- ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించాలని వినతి
- శాసనసభలో ఎమ్మెల్యే ప్రస్తావన
- భవిష్యత్తుపై చిగురిస్తున్న ఆశలు

బొబ్బిలి పేరు చెబితే అక్కడి రాజుల పౌరుష.. పరాక్రమాలతో పాటు ఠక్కున గుర్తుకువచ్చేది ఇంకొకటి ఉంది. అదే ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన వీణ. వీణ తయారీకి ప్రధాన వనరైన పనస కలప ప్రస్తుతం దొరకడం గగనమవుతోంది. కళాకారుల విజ్ఞప్తి మేరకు ఇటీవల ప్రభుత్వం పనస కలపపై దృష్టి పెట్టింది. ఈ చెట్లను పెంచే దిశగా వడివడిగా అడుగులు వేయాలని వీరు కోరుతున్నారు.



వీణను తయారు చేస్తున్న కళాకారుడు

బొబ్బిలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)



బొబ్బిలి వీణకు పనస కలప గండం పొంచి ఉంది. ఈ పరిసర ప్రాంతాల్లో పనస కలప దొరకడం కష్టమవుతోంది. ఇది లేకుంటే వీణలు తయారు చేయడం కష్టం. కనీసం ఇతర రాష్ట్రాల నుంచి కలపను సమకూర్చాలని చాలా సంవత్సరాలుగా వీణ కార్మికులు కోరుతున్నారు. తాజాగా ఎమ్మెల్యే బేబీనాయన శాసనసభ వేదికగా వీణల సమస్యను ప్రస్తావించారు. పనస కలప తమిళనాడు, కేరళ నుంచి తెప్పించేందుకు చొరవ తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించింది. ఇది కళాకారుల్లో ఆనందాన్ని నింపుతోంది.

ఇదీ చరిత్ర..

బొబ్బిలి వీణ పేరు దేశవిదేశాల్లో మార్మోగుతోంది. ఇక్కడ తయారైన వీణలు ఇతర రాష్ట్రాలు, దేశాల ప్రజల మదిని దోచాయి. వీటికి జాతీయ, అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. విజయనగరం సంస్థానంలో సహాయ వడ్రంగిగా పనిచేసిన మునినాడ చిన్నయ్య నాడు నూజివీడు వెళ్లి వీణల తయారీలో మెలకువలను ఔపోసన పట్టారని చరిత్ర చెబుతోంది. ఆయన బొబ్బిలి ఆస్థాన వడ్రంగి అయిన రాయల వీరభద్రునికి వీణల తయారీ కళలో శిక్షణ ఇచ్చారు. బొబ్బిలి సంస్థానంలో 11వ రాజు మహారాజా శ్వేతాచలపతి రంగారావు అనుమతితో సర్వసిద్ధి అప్పలస్వామి, సర్వసిద్ధి సాంబన్నలకు వీణల తయారీ కళను నేర్పించారు. నాటి నుంచి తరువాత సంస్థానాధీశులు కూడా వీణల తయారీని ప్రోత్సహించారు. ఇందుకోసం పాత కోటలో ఓ గదిని వీణల తయారీ కళాకారులకు కేటాయించారు. 1994లో గొల్లపల్లికి చెందిన సర్వసిద్ధి రమణ మాస్టారు వాటా ధనాన్ని సమకూర్చడంతో అప్పటి రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దింటి జగన్మోహనరావు హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా గొల్లపల్లిలో వీణల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. ఇక్కడి వీణలు నాటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్‌ను సైతం ఆకట్టుకున్నాయి. ఇంత పేరున్న పరిశ్రమకు కలప పూర్తిస్థాయిలో సమకూరక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పనసే ఎందుకంటే..

పనస కలపతో చేసిన వీణలు అందం, తేలిక గుణం సంతరించుకుంటాయి. పనస కలప కొరత కారణంగా వీణల తయారీని పూర్తి స్థాయిలో చేపట్టలేకపోతున్నారు. మరోవైపు పదేళ్ల క్రితం ఇచ్చిన యంత్రాలు, పనిముట్లకు కాలం చెల్లడంతో మూలకు చేరాయి. వీణల తయారీదారులకు అందుబాటులో ఉండేలా అటవీ ప్రాంతంలో పనస చెట్లను విరివిగా పెంచుదామని తాజాగా అసెంబ్లీలో మంత్రి సవిత చెప్పారు. ఒక పనస మొక్కను నాటితే... అది చెట్టుగా మారి వీణ తయారీకి ముడిసరుకుగా మారడానికి కనీసం పాతికేళ్లు పడుతుంది. అలా పనస కలప అందుబాటులోనికి వచ్చే వరకు తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో అందుబాటులో ఉన్న పనస కలపను వీణల తయారీకి సరఫరా చేయాలని కళాకారులు కోరుతున్నారు. గత ఏడాది అధికారులు వచ్చినప్పుడు అలజంగి విజ్ఞేశ్వరరావు అనే వృద్ధ కళాకారుడు తమ ఆవేదనను వెలిబుచ్చారు. సంగీత వీణలు తయారు చేయగల వృద్ధకళాకారులు అతి కొద్ది మంది మాత్రమే ఉన్నారని... ముడి సరుకు (పనస చెట్టు కలప) లేకుండా ఎన్ని పథకాలు పెడితే ఏం లాభమని ప్రశ్నించా రు. అటవీ శాఖ ఆంక్షలతో పనస కలప తమకు లభ్యం కావడం లేదన్నారు. వృద్ధ కళాకారుల తరం అంతరించి పోతే సంగీత వీణల తయారీకి కళాకారులు దొరకడం కష్టమవుతుందని తెలిపారు. ఈ తరం వారిని తయారు చేయాల్సి ఉందని సూచించారు. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు.

శాసనసభలో చర్చించడం హర్షణీయం..

బొబ్బిలి వీణకు మరింత గుర్తింపు తీసుకురావాలని శాసనసభలో ఎమ్మెల్యే బేబీనాయన చర్చించడం హర్షించదగ్గ విషయం. పనస కలపను అందుబాటులోకి తెస్తే కళాకారులకు మరింత ఉపాధి దొరుకుతుంది. ఆధునిక శిక్షణ, పనిముట్లు, కలపను సరఫరా చేయాలి. బొబ్బిలి, గొల్లపల్లి, వాడాడ గ్రామాలకు చెందిన 50 మంది కళాకారులకు రూ.పదివేల విలువ చేసే కిట్లను గత ఏడాది పంపిణీ చేశారు. వీటి ద్వారా కళాకారులకు సమయం ఆదా అవుతోంది. అదేవిధంగా సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం గుర్తింపు కార్డులను జారీ చేస్తే ఇంకా బావుంటుంది.

-సర్వసిద్ధి రామకృష్ణ, వీణల కేంద్రం ఇన్‌చార్జి



కళాకారులు తయారు చేసిన వీణలు



బొబ్బిలి వీణల తయారీ కేంద్రం

ఎంతమంది పిల్లలు ఉన్నా 'తల్లికి వందనం'

- మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.2 కోట్లు
- రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

సాలూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి కూడా తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయనున్నట్టు రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె నియోజకవర్గ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, కుటుంబ సాధికార సారథులతో సమావేశం నిర్వహించారు. ముందుగా సీనియర్ కార్యకర్త ఆదాడ సత్తిబాబు మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలో 40,200 పార్టీ సభ్యత్వాలు చేసి ప్రథమ స్థానంలో నిలిచామని తెలిపారు. దీనికి సహకరించిన అందరికీ అభినందించారు. మున్సిపాల్టీలో అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు రూ.రెండు కోట్లు మంజూరు చేశారని చెప్పారు. రాష్ట్రంలో ఉచిత గ్యాస్ పథకం ద్వారా 98 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. జూన్ నెలలో పాఠశాలలు తెరిచే నాటికి ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధి చేకురుతుందని అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రూ.20 వేలు జమ కానున్నాయని అన్నారు. కుటుంబ సాధికార సారథులు సమర్థంగా పనిచేయాలని ఆమె సూచించారు. ఈ నెల 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామాల్లో తప్పనిసరిగా నిర్వహించాలని కోరారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆరుగురికి రూ.8 లక్షల చెక్కులను ఆమె అందజేశారు. పార్టీ సభ్యత్వ కార్డులను నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), మండల నాయకులు గుళ్ల వేణు, పరమేశ్, వెంకటరమణ, గుడేపు యుగంధర్, టీడీపీ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ముఖీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

12 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు..

మే నెలలో జరగనున్న సాలూరు గ్రామదేవత శ్యామలాంబ ఉత్సవానికి సంబంధించి ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఇప్పటికే అదనంగా 12 ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేశామని ఎస్ఈ చలపతిరావు మంత్రికి తెలిపారు. అవసరమైతే మరికొన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజలతో మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలమాంబ ఆలయ హుండీల లెక్కింపు

మక్కువ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ అమ్మవారి 8, 9 వారాల జాతరకు సంబంధించి చదురుగుడి, వనం గుడి ఆలయాల హుండీలను గురువారం లెక్కించారు. చదురుగుడి హుండీల ద్వారా రూ.2లక్షల 94వేల 984, వనంగుడి హుండీల ద్వారా లక్షా 16వేల 204 రూపాయలతో కలిపి ఆదాయం రూ.4,11,188 వచ్చింది. జిల్లా దేవదాయశాఖాధికారి ఎస్.రాజారావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి వీవీ సూర్యనారాయణ, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ నైదాన తిరుపతిరావు, సర్పంచ్ వెదుళ్ల సింహాచలమ్మ, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భద్ర మహంకాళమ్మకు పూజలు



లక్కవరపుకోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్.కోటలోని భద్రమహంకాళమ్మకు గురువారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఏటా కొత్త అమావాస్యకు ముందు మూడు రోజుల పాటు అమ్మవారి పండగ నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. బుధవారం తొలేళ్ల ఉత్సవం, గురువారం అనుపోత్సవం అనంతరం ముగింపోత్సవం జరుగుతుంది. గురువారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం భారీ ఊరేగింపుతో అనుపోత్సవం నిర్వహించారు.



బి.సుమంత్



ఎన్.అనూరాధ

జాతీయ కబడ్డీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

విజయనగరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఎన్.అనూరాధ, బి.సుమంత్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 28 నుంచి 31 వరకు బీహార్ రాష్ట్రంలో జరగబోయే జాతీయ సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్‌కు జిల్లా నుంచి ఈ ఇద్దరు ఎంపికయ్యారు. వీరి ఎంపికపై కబడ్డీ జిల్లా సంఘం చైర్మన్ ఐవీపీ రాజు, అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావుదొర, కె.వి.ప్రభావతి, వీడీ సౌదామణి హర్షం వ్యక్తం చేశారు.

వేతనదారులకు వేసవి కష్టాలు



- 'ఉపాధి' పని ప్రదేశంలో కానరాని నీడ, తాగునీరు
- ఫలితమివ్వని తాత్కాలిక పందిళ్లు
- ముందస్తు చర్యలు చేపట్టని యంత్రాంగం

రాజాం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకం వేతనదారులకు వేసవి కష్టాలు వెంటాడుతున్నాయి. పని ప్రదేశంలో నీడ కోసం షామియానాలు, తాగునీరు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉన్నా... చాలా చోట్ల సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఎండ తీవ్రత ఉంటోంది. మరోవైపు గత కొద్దిరోజులుగా జిల్లాలోని కొన్ని మండలాల్లో వడగాల్పుల తీవ్రత ఉంది. ఈ నేపథ్యంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో వేతనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

● చురుగ్గా ఉపాధి పనులు..

జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. వ్యవసాయ పనులు లేకపోవడంతో వేతనదారులు ఎక్కువగా వస్తున్నారు. ప్రస్తుతం విజయనగరం జిల్లా వ్యాప్తంగా 65 వేల మంది వరకూ పనులకు హాజరవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఎండ బాధ ఒక వైపు.. వేడిగాలులు మరోవైపు వేతనదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వేతనదారులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించింది. ముఖ్యంగా పని ప్రదేశాల్లో నీడకోసం టార్పాలిన్లు అందించేది. అప్పట్లో జిల్లాలో 7 వేలకుపైగా టార్పాలిన్లు అందించారు. చాలా ఏళ్లు కావడంతో అవి పాడయ్యాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వేతనదారులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. ఈ ఏడాది కూడా అధికారులు ఎటువంటి ఏర్పాట్లు చేయడం లేదు. దీంతో వేతనదారులే తాటి, కొబ్బరి కమ్మలతో తాత్కాలికంగా పందిళ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆ పాకల కింద వేతనదారులు తెచ్చుకున్న మంచినీటి సీసాలు, అల్పాహారం పెట్టుకోవడం తప్ప సేదతీర్చుకునే అవకాశం లేదు.

● మంచినీరూ కరువే..

గతంలో పని ప్రదేశాల్లో మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉంచేవారు. స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో వీటిని ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఏడాది ఎండలు మండుతున్నా.. వాటిని ఏర్పాటు చేయలేదు. దీంతో వేతనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వేతనదారులే ఇళ్ల నుంచి క్యాన్లలో నీటిని తరలిస్తున్నారు. మరోవైపు పని ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు కూడా లేవు. గత ఏడాది వేసవిలో వడదెబ్బకు చాలామంది మృత్యువాత పడ్డారు. మరోసారి ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని వేతనదారులు కోరుతున్నారు.

● సిబ్బందికి ఆదేశాలిచ్చాం..

పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు కల్పించాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ముఖ్యంగా నీడనిచ్చేందుకు షామియానాలు వేయాలని ఆదేశించాం. ఎండ తీవ్రత లేని సమయంలో మాత్రమే పనులు చేపట్టాలని సూచించాం. పని వేళలనూ మార్చాం. చెరువులలో కమ్మల శాలలు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. ఎన్జీవోల ద్వారా మజ్జిగ, వైద్యాధికారుల ద్వారా ఓఆర్ఎస్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేయించాలని ఏపీవోలకు చెప్పాం.

-శారదాదేవి, డ్వామా పీడీ, విజయనగరం

సీతంపేట ఏజెన్సీలో...



మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న గిరిజనులు

సీతంపేట రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో ఉపాధి వేతనదారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. నీరు, నీడ లేక పని ప్రదేశాల్లో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 2017-18 మధ్య కాలంలో ఉపాధి కూలీలకు నీడ కోసం టెంట్లు, మంచినీటి సౌకర్యం, పనిముట్లు, ప్రథమ చికిత్స కిట్లతో పాటు మజ్జిగ వంటివి అందించారు. అప్పట్లో 1,625 శ్రమశక్తి సంఘాలకు వీటిని అందజేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఉపాధి వేతనదారుల కష్టాలను గుర్తించలేదు. సొంత డబ్బులతో పనిముట్లను కొనుక్కొని గిరిజనులు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో లేకపోవడంతో పనుల సమయంలో దెబ్బలు తగిలినపుడు అవస్థలకు గురవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం వేతనదారుల కష్టాలను గుర్తించి ఉపాధి పనుల వేళల్లో స్వల్ప మార్పులను తీసుకువచ్చింది. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 5 వరకు ఎండకు దొరకకుండా పనులు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఇది కొంతలో కొంత ఊరటనిస్తోంది. గతంలో ఉపాధి పనుల వద్దకు చిన్న పిల్లలను తీసుకువస్తే వారిని ఆడించేందుకు ఆయాలను అందుబాటులో ఉంచేవారు. ఇప్పుడు ఈ పరిస్థితి లేకపోవడంతో చిన్నారులతో తల్లులు ఇబ్బందులకు గురవుతున్నారు.

వెంటాడుతున్న సమస్యలు

మండలంలో 1000 వరకు శ్రమశక్తి సంఘాలు పనులను చేస్తున్నాయి. వీరికి రోజు వారి ఉపాధి వేతనం రూ.257 వరకు వస్తోంది. పనులు చేసే చోట మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో వేతనదారులు వడదెబ్బకు గురై ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. గడచిన పది వారాలుగా కూలీలకు వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. దీంతో వేతనాలు తమ బ్యాంక్ ఖాతాలకు ఎప్పుడు జమ అవుతాయోనని ఆశతో ఎదురుచూస్తున్నారు ప్రభుత్వం స్పందించి మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు వేతనాలను చెల్లించాలని వీరంతా కోరుతున్నారు.

బకాయిలు రూ.కోట్లలోనే...

ఉపాధి వేతనదారులు ఇటీవల చేసిన భూ అభివృద్ధి, టెర్రాసింగ్, ఫార్మ్‌పాండ్ వంటి 150 పనులకు చెల్లించాల్సిన వేతన బకాయిలు రూ.కోటికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. మెటీరియల్ కాంపోనెంట్ కింద మారుమూల గిరిజన గ్రామాలకు నిర్మించిన సీసీ రహదారులు, హార్టికల్చర్ తదితర 200కు పైగా పనులు జరగడంతో వాటికి చెల్లించాల్సిన బకాయిలు మరో రూ.3.5 కోట్ల వరకు ఉన్నట్లు సమాచారం. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో గిరిజన కూలీలు ఇబ్బందులు పడుతన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో పనులు చేస్తున్న గిరిజన వేతనదారులకు పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని గిరిజన సంఘ నాయకులు బిడ్డిక అప్పారావు డిమాండ్ చేశారు. వేతనదారులు వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోతే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు.

పది రోజుల్లో చెల్లిస్తాం..

వేతనదారులకు ఇంకా వేతనాలు చెల్లించాల్సి ఉందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ శ్రీహరి తెలిపారు. మరో పది రోజుల్లో చెల్లించనున్నట్టు చెప్పారు. ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశాల్లో టెంట్లు, పనిముట్లు, మంచినీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్ల కోసం ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. ఉపాధి వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వం పనివేళల్లో మార్పులు చేసిందని చెప్పారు.

శైలజ, సుధాకర్‌కు జీవిత సాఫల్య పురస్కారం

● గురునారాయణ కళాపీఠం ప్రకటన

విజయనగరం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్పీ శైలజ, సినీనటుడు శుభలేఖ సుధాకర్‌కు గురునారాయణ కళాపీఠం తరఫున జీవిత సాఫల్య పురస్కారం అందజేయనున్నామని కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ గాయకుడు బి.ఏ.నారాయణ తెలిపారు. ఏప్రిల్ 1న నగరంలోని ఆనందగజపతి కళాక్షేత్రంలో కళాపీఠం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పురస్కారాన్ని ప్రదానం చేయనున్నామన్నారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాపీఠం వార్షికోత్సవంలో భాగంగా ఇంతవరకూ లలిత సంగీత దర్శకుడు బందారు చిట్టిబాబు, సినీ సంగీత దర్శకుడు మాదవపెద్ది సురేష్, మధుర గాయని పి.సుశీల, సంగీత దర్శకుడు మణిశర్మలకు ఈ పురస్కారాలు ప్రదానం చేశామన్నారు. ఈ ఏడాది శైలజ, సుధాకర్‌లతో పాటు తబలా విద్వాంసుడు జగ్గారం దనుంజయ్‌ను కళాపీఠం ఆధ్వర్యంలో సత్కరించనున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ గాయని పద్మభూషణ్ పి.సుశీల పాల్గొంటారన్నారు. సమావేశంలో కళాపీఠం అధ్యక్షురాలు సన్యాసమ్మ, హోటల్ మయూర అధినేత యర్రగడ్డ బాబూరావు, ప్రతినిధులు పద్మావతి, మారుతి శ్రీనివాసరావు, వైవీవీ సత్యనారాయణ, సుంకరి శ్రావణి, సీహెచ్ రామచంద్రశేఖర్, చీకటి చంద్రిక, ఎస్.సూరినాయుడు, బి.నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వానపత్రాలు చూపుతున్న కళాపీఠం వ్యవస్థాపకుడు, ప్రతినిధులు

3న ఉద్యోగావకాశాలపై సదస్సు

శ్రీకాకుళం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య రంగంలో నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలపై వచ్చే నెల 3న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం రాగోలులో జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించ నున్నట్టు తెలిపారు. ముఖ్యఅతిథిగా కిమ్స్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు హాజరుకానున్నట్టు తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు వైద్య, ఆరోగ్య రంగంలో విస్తృత ఉద్యోగ అవకాశాలపై ఈ సదస్సులో వెల్లడిస్తారని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు గూగుల్ లింక్‌లో తమ పేర్లను వచ్చే నెల 2వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 ఫోన్ నెంబర్లలో గానీ, నేరుగా రాగోలులో జెమ్స్ వైద్య కళాశాలలో గల బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ ప్రతినిధులను సంప్రదించాలని కోరారు.

నేడు కవి గాయక సమ్మేళనం

విజయనగరం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సాహితీ ప్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కవిగాయక సమ్మేళనం జరుగుతుందని సాహితీ ప్రవంతి ప్రతినిధి చీకటి దివాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సాహితీ, సంగీత, రచయిత, కళాకారులు, వివిధ వర్గాల్లో ప్రతిభావంతులైన పలువురు కవిగాయక సమ్మేళనంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమాన్ని పాయల మురళీకృష్ణ, కొత్తర్తి శ్రీనివాసరావు, సీహెచ్ శ్యామల తదితరులు వర్ధక్కరిస్తారని పేర్కొన్నారు.

ఆశీలు పాట ఖరారు

గజపతినగరం, మార్చి27 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం పంచాయతీలో రోజువారీ ఆశీలు వేలం పాట గురువారం జరిగింది. స్థానిక సచివాలయంలో సర్పంచ్ నరసింహులమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశీలు పాటను ఆదే గ్రామానికి చెందిన బూర్లి లక్ష్మి దక్కించుకున్నారు. ప్రభుత్వం పాట రూ.2 లక్షలు కాగా బూర్లి లక్ష్మి రూ.2 లక్షలకు రూపాయి అదనంగా వేసి పాటను దక్కించుకున్నారు. ఏడాది కాలపరిమితిగా నిర్ణయించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు గుర్తింపు

వేపాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చేపట్టిన ఉపాధి పనుల్లో రూ.55 లక్షల వరకు తేడాలు ఉన్నట్టు అధికారులు తేల్చారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఏయే గ్రామాల్లో అవకతవకలు జరిగాయో అధికారులు స్పష్టం చేశారు. అలాగే 100 రోజుల పని కల్పించనందుకు రూ.22 వేల జరిమానాను విధించారు. సామాజిక తనిఖీలో ఎస్‌ఆర్పీ లక్ష్మణరావు, డీఆర్పీలు రవి, వినోద్, ఎంపీడీ, ఏపీడీ కె.రామారావు, ఎంపీడీవో సీహెచ్.నూకరాజు, ఏపీవో ఆదిలక్ష్మి, ఎంపీపీ డొగ్గ సత్యవతి, జడ్పీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

వేపాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆతవలో తారురోడ్డు పనులను గురువారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో రహదారి పనులు నిలిపేసిన సంగతి తెలిసిందే. స్థానికుల ఆందోళన నేపథ్యంలో పనులు పూర్తి చేయిస్తానని గతంలో ఎమ్మెల్యే మాటిచ్చారు. అందుకు తగ్గట్టు పనులు జరుగుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

నేటినుంచి రుణ లబ్ధిదారుల ఎంపిక

నెల్లిమర్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం నుంచి బీసీ కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఎంపీడీవో కె.రామకృష్ణరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 28న, ఏప్రిల్ 2న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపిక చేస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి, మార్చి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ మస్తాన్‌వలీ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో కొంగానపాలెం, మెట్టపల్లి, నందిగాం, తేలుపల్లి, దిబ్బలపాలెం, దేవుపల్లి, బిల్లిపేట, గాలువానిపేట, కొండగుంపాం, రామచంద్రాపేట గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తామన్నారు.

రేపు టీడీపీ సీనియర్లకు సన్మానం

శృంగవరపుకోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ఆ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను సన్మానిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు తెలిపారు. ఎమ్మెల్యే లలితకుమారి సూచన మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

ఘనంగా బంగారమ్మతల్లి తీర్థం

జామి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్రంగి లో గ్రామదేవత బంగారమ్మతల్లి తీర్థమహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని తాండ్రంగి సర్పంచ్ కరక వందన, దశరథ్ దంపతులు, జనసేన నేత పోలిపల్లి చిన్నంనాయుడు తదితరులు దర్శించుకున్నారు. పండగ సందర్భంగా ఎద్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. పెత్తఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



ఆలయం వద్ద భక్తుల సందడి

ఎక్కల దేవతమ్మ ఉత్సవంలో కోండ్రు

రాజాం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొగిరి గ్రామంలో నిర్వహిస్తున్న ఎక్కల దేవతమ్మ ఉత్సవంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నాయకులతో చర్చించారు. అనంతరం ఇటీవల గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్న సోపేరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కోటగిరి సూర్యారావును ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుమల మన్మధరావు, జడ్డు విష్ణుమూర్తి, గురవాన నారాయణరావు, కిమిడి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కోండ్రు

ఫ్యాపిటో నూతన కార్యవర్గం ఎన్నిక

విజయనగరం దాసన్నపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని యూత్ హాస్టల్‌లో ఫ్యాపిటో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. ఫ్యాపిటో సెక్రటరీ జనరల్, రాష్ట్ర పరిశీలకుడు ఎస్.చిరంజీవి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా ఏపీటీఎఫ్ ప్రతినిధి పాలతేరు శ్రీనివాస్, కోచైర్మన్‌గా లోచింటి శివప్రసాదరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఈశ్వరరావు, కార్యదర్శిగా వంకల రమణ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులతో రాష్ట్ర పరిశీలకులు చిరంజీవి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కళ్లీలు, మోసాలపై దృష్టి సారించండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెట్రోల్ బంకుల్లో కల్తీలు, మోసాలు జరుగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పౌరవేదిక జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. గురువారం తూనికలు, కొలతల శాఖ సహాయ నియంత్రికుడు టీవీ రంగారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఒక పెట్రోల్ బంకు యాజమాని వినియోగదారులు ఆక్రమంగా దోచుకున్న తీరును సోషల్ మీడియాలో ప్రముఖ టీవీ చానల్‌లో చూసిన వినియోగదారులు విస్మయానికి గురయ్యారన్నారు. అటువంటి ఘటనలు జిల్లాలో జరుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు రామచంద్రరాజు, రామ్మోహన్ తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న భీశెట్టి బాబ్జీ

ధర్నాను విజయవంతం చేయండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సమస్యలపై ఏప్రిల్ 1న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన దుప్పాడ, జొన్నవలసల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్న చెరువుల వద్ద కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. తొమ్మిది వారాలకు పైగా ఉపాధి బిల్లులు బకాయిలు ఉన్నాయని, నెలల తరబడి ఉపాధి హామీ బిల్లులు చెల్లించకపోవడంతో కూలీల్లో పనిపై ఆసక్తి తగ్గిపోతోందన్నారు. గతంలో మజ్జిగ, నీరు, టెంట్లు ఏర్పాటు చేసేవారని, పారలు, గునపాలు, తట్టలకు డబ్బులు గ్రామం నుంచి చెరువుకు ఉండే దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలు ఇచ్చేవారని, ప్రస్తుతం అమలు చేయడం లేదన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి

బాలికలకు వసతి కల్పించండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మోడల్ స్కూళ్లో 6వ తరగతి నుంచి బాలికలకు వసతి సౌకర్యం కల్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ఖుఖాలాలు, పి.శ్రీనివాస్ కోరారు. మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ తహీరా సుల్తానాను గురువారం ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో బాలికల విద్యకు ఉపయోగపడుతుందన్నారు. మోడల్ స్కూళ్లలో 9వ తరగతి నుంచి మాత్రమే వసతి కల్పిస్తుండటంతో దీంతో 6వ తరగతిలో ప్రవేశానికి బాలికలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ విడుదల చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వెనక్కి తీసుకోండి

విజయనగరం రింగురోడ్డు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు నల్ల చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ఏపీసీసీ మైనార్టీ వైస్ చైర్మన్ ఎండీ హాస్సేన్ షరీఫ్ డిమాండ్ చేశారు. గురువారం తోటపాలెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మసీదులు, దర్గాలు, భూములు లాక్కొనే ప్రయత్నంలో భాగంగా ఈ చట్ట సవరణను చేయడం జరిగిందని ఆరోపించారు. తక్షణమే వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వెనక్కి తీసుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌కె సమీర్, ఎవిహెచ్చన్, తిరుపతిరావు, దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా వైస్ ఎంపీపీ ఎన్నిక

భోగాపురం, మార్చి27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం వైస్ ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రిసైడింగ్ అధికారి, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్.వెంకటరామన్ ప్రకటించారు. వైసీపీకి చెందిన భోగాపురం-1 ఎంపీటీసీ సభ్యురాలు పచ్చిపాల నాగలక్ష్మి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. మండలంలో వైసీపీకి 16 ఎంపీటీసీ సభ్యులు, టీడీపీకి ఆరుగురు, జనసేనకి ఒక్కరే ఉన్నారు. ఈనేపథ్యంలో వైస్ ఎంపీపీ ఎన్నికకు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు 9 మంది హాజరు కావడంతో వైస్ ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవమైంది. నాగలక్ష్మికి ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గాయత్రి, తహసీల్దారు ఎం.సురేష్, తదితరులు పాల్గొన్నారు. ఎన్నికైన వైస్ ఎంపీపీ పచ్చిపాల నాగలక్ష్మిని ఎంపీపీ ఉప్పాడ అనూష వైసీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి సత్కరించారు.



ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

భూసర్వేతో రైతులకు పూర్తిహక్కు

రేగిడి, మార్చి 27, (ఆంధ్రజ్యోతి): భూరీసర్వేతో రైతులకు పూర్తిహక్కులు కల్పిస్తామని, ఇందుకు రైతులు పూర్తి ఆధారాలతో ముందుకు రావాలని జిల్లా సర్వేలాండ్ రికార్డు అధికారి రమణమూర్తి, చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి అన్నారు. మండలంలో అంబఖండిలో గురువారం భూరీసర్వేపై రైతులతో నెవనాఖా గ్రామసభ నిర్వహించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు చిన్నారావు, సర్పంచ్ శాసపు గోవిందనాయుడు ఉన్నారు.

జూనియర్ సివిల్ న్యాయాధికారిగా నైమిష

రాజాం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాజాం జూనియర్ సివిల్ న్యాయాధికారిగా కెంబూరు నైమిష గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ జూనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణ సాయితేజకు సీనియర్ సివిల్ న్యాయాధికారిగా పదోన్నతి రావడంతో జూనియర్ సివిల్ న్యాయాధికారి పోస్ట్ ఖాళీ అయ్యింది. దాంతో నైమిషను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.



న్యాయాధికారి నైమిష

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

గజపతినగరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ జి.ఏ.వి.రమణ అన్నారు. గురువారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ప్రవంచ ఆరోగ్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పూసర్ల మోహన్ అధ్యక్షతన జరిగిన సందర్భంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మాయమాటలకు లోబడి మోసపోవద్దన్నారు. వ్యాపారస్తులు రాత్రి సమయాల్లో వాచ్‌మెన్ లేదా సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కుసుమంచి సుబ్బారావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న సీఐ రమణ

తప్పులు లేని ఓటరు జాబితాకు కృషి

బొండపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు బూత్‌లెవెల్ అధికారులు నిరంతరం కృషి చేయాలని తహసీల్దారు ఎం.సురేష్, ఎంపీడీవో డిప్యూటీ తహసీల్దారు వి.వి.ఆర్.జగన్మోహనరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

శృంగవరపుకోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సతీశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సండి సోమేశ్వరరావు అధ్యక్షతన జరుగుతుందన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

విజయనగరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగివిజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్ల మండలంలోని నాగల్లవలస గ్రామానికి చెందిన సంబరి రమేష్ (48)గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. రెండు రోజుల కిందట రమేష్ పురుగుల మందు తాగాడు.భార్య ఉమాదేవి విషయం చెప్పడంతో ఆమె అందరినీ పిలిచి విజయనగరం ఆసుపత్రికి తరలించింది. రెండు రోజుల పాటు మృత్యువుతో పోరాడి రమేష్ తుది శ్వాస విడిచాడు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే గుర్ల మండలంలోని నాగలవలసలో రమేష్, భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారు.సరైన జీవనాధారం లేకపోవడంతో కారు డ్రైవర్, పాలవ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ గుర్లలో టిఫిన్ దుకాణం నడిపేవాడు. ఏవీ కలిసి రాకపోవడంతో చాలాచోట్ల అప్పులు చేశాడు.అవి తీర్చలేక ఇబ్బంది పడేవాడు. అప్పులవాళ్లు దారిలేకతాను చనిపోతే బాగుండునని పదేపదే ఇంట్లో అంటుండేవాడు. నెలరోజుల కిందట బార్యతో పాటు ద్విచక్రవాహనంపై వెళ్తూ చుక్కపేట సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డారు. అప్పట్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ముఖ్యంగా రమేష్‌కు కాలు, చెయ్యి, తలపై దెబ్బలు తగిలాయి. ప్రస్తుతం మంచానికి పరిమితమయ్యాడు. నానాటికి ఆర్థిక ఇబ్బందులు పెరుగుతుండటంతో రెండురోజుల పురుగు మందు తాగాడు. మృతుడికి భార్య ఉమాదేవి అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఇద్దరు పిల్లలు సూర్యతేజ, హైమావతి ఉన్నారు. రమేష్ మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



రమేష్ (ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం గ్రామానికి చెందిన సింగారపు మహేష్ (37) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మహేష్‌కు మద్యం తాగే అలవాటు ఉండటంతో భార్య పార్వతి, తల్లి గౌరమ్మ తరచూ మందలించేవారు. మహేష్ ఈనెల 25న అలస్యంగా ఇంటికి రావడంతో.. భార్య, తల్లి ఎప్పటిలాగే మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆయన గడ్డి మందు తాగి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన భార్య, తల్లి.. పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని పై ఎస్ఐ ఎం.రాజేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

14మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

జామి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్రంగి గ్రామానికి చెందిన 14 మందిపై గురువారం సాయంత్రం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వీరజనార్దన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తలి గౌరినాయుడు ఇంటికి వెళ్లేదారిలో కారు రాకుండా సీసీ రోడ్డుపై వడిసెల కొలరాలు, ఆతడి కుటుంబ సభ్యులు అడ్డుగా రాతితో నిర్మాణాలు చేశారన్నారు. ఆటోలు అడ్డుపెట్టారన్నారు. బాధితుడు గౌరినాయుడు పలుసార్లు ప్రశ్నిస్తే దుర్భాషలాడుతూ దాడికి యత్నించారన్నారు. ఈనెల 23న రాత్రి 7 సమయంలో 14 మంది దారికాసి కర్రలతో దాడికి ప్రయత్నించి కులం పేరుతో దూషించారని తెలిపారు. యాసిడ్ పోసి తగలెస్తామని వీధిలోకి రాకుండా చేస్తామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. బాధితుడి ఫిర్యాదుపై కేసునమోదు చేసి పాటు ఆతడి కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆక్రమణల పరిశీలన

వేపాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వేపాడ గ్రామంలో ఆక్రమిత స్థలాలను గురువారం తహసీల్దారు జె.రాములమ్మ పరిశీలించారు. వేపాడలో ఆక్రమణలపై కొందరు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో తహసీల్దారు సర్వే చేయించారు. మంచినీటి కోనేరు గట్టుపై వేసిన సీసీ రోడ్డు నిర్మాణంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఐ రామలక్ష్మి, సర్వేయర్ గంగాధర్, వీఆర్వో అప్పరాం, గ్రామపెద్దలు ఉన్నారు.



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దారు

గంజాయిపై అప్రమత్తంగా ఉండండి

రాజాం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గంజాయిని నియంత్రించడంతో పాటు కేసులు దర్యాప్తు సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు స్పష్టం చేశారు. ఇక్కడి రూరల్ స్టేషన్‌లో ఏపీపీ విజయలక్ష్మితో కలిసి రూరల్ సర్కిల్ పరిధిలోని మూడు మండలాల ఎస్ఐలతో ఆయన గురువారం సమావేశమయ్యారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. కేసుల దర్యాప్తునకు సంబంధించి పక్కదారిన అనుసరించాల్సిన విధానంపై ఎస్ఐలకు అవగాహన కల్పించారు. సమావేశంలో రేగిడి ఎస్ఐ నీలావతి, సంతకవిటి ఎస్ఐ గోపాలరావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న రూరల్ సీఐ ఉపేంద్రరావు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బెలగాం/పార్వతీపురం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పార్వతీపురం ఐసీడీఎస్ పీవో శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మండలం బీసురోటు, చినబొండపల్లి, బాలగుడబ గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు, ఆదేవిధంగా సీతంపేట మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. వచ్చే నెల 4 తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. బీసురోటు ఓసీ కేటగిరికి, సీతంపేట ఎస్టీ, చిన బొండపల్లి బీసీ-డికి, బాలగొడబ ఎస్సీ కేటగిరికి కేటాయించారని వెల్లడించారు.

● సాలూరు రూరల్: సాలూరు మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి కోరారు. ఆమె బుధవారం విలేకర్లతో మాట్లాడారు. సాలూరు మండలం కురుకూటి ఒకటి, దత్తివలస కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎం.కొత్తవలస, జిందులపాడులో మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎగువ మెండంగి, చిన ఊటగెడ్డలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కురుకూటిక, బందపాయి, చిన ఊటగెడ్డ ఓసీలకు, ఎగువమెండంగి, ఎం.కొత్తవలసలు ఎస్టీ(నోటిఫైడ్)లకు, దత్తివలస బీసీ ఏకు కేటాయించారని తెలిపారు. పోస్టు తగిన ఉత్తర్వులు, 21 నుంచి 35 ఏళ్లలోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులివ్వాలన్నారు. దరఖాస్తులను పోస్టు ద్వారా గానీ, నేరుగా సాలూరు సీడీపీవో కార్యాలయానికి గానీ వచ్చే నెల 4 లోపల అందజేయాలన్నారు.

● గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గడవంకదార గ్రామంలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, దేయవాడ, బొద్దంకర గ్రామాల్లో ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్టు భద్రగిరి ఐసీడీఎస్ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. ఈమేరకు గురువారం ఆమెఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మూడు పోస్టులను ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించామని చెప్పారు. అర్హతగల అభ్యర్థులు కార్యాలయానికి దరఖాస్తులు అందజేయవచ్చునని తెలిపారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండండి

సీతంపేట రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ అన్నారు. గురువారం దోనుబాయి, కుసిమి పీహెచ్‌సీని సందర్శించి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంవో మాట్లాడుతూ మలేరియా వ్యాప్తి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సీతంపేట ఏజెన్సీలో మలేరియా మరణాలు లేకుండా చూడాలని వైద్యాధికారి భాస్కరరావుకు ఆదేశించారు. డీఎంవోతో పాటు కుసిమి పీహెచ్‌సీ వైద్యాధికారి చాందిని, వైద్య సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎంవో

పట్టపగలే కలప అక్రమ రవాణా

శృంగవరపుకోట రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలప స్మగ్లర్ల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది. సంబంధిత శాఖ జాడ పెద్దగా లేకపోవడంతో పట్టపగలే కలపను అక్రమంగా మిల్లులకు తరలిస్తున్నారు. నెంబర్ ప్లేట్లు లేని వాహనాల ద్వారా దర్జాగా కలపను అక్రమార్కులు తరలిస్తున్నారు. మండలంలోని పలు సా మిల్లుల వద్ద రికార్డుల్లో లేని కలప అధికంగా ఉన్నా సంబంధిత అధికారులు అటు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అటవీ శాఖ అధికారులు అక్రమార్కులను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వెంకటరమణపేట వద్ద నెంబర్‌ప్లేట్ లేని వాహనంలో కలప రవాణా

అసంపూర్తిగా భవన నిర్మాణం

భోగాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం భోగాపురంలో రైతు భరోసా కేంద్రం భవనం అసంపూర్తిగా నిలిచి ఉన్నాయి. ఫ్లోరింగ్ మినహా దాదాపు అన్ని పనులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో భవనం పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పర్యవసానంగా పనులు నేటికీ అసంపూర్తిగా ఉన్నాయి. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రం భవనం కిరాయి భవనంలో కొనసాగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు భరోసా కేంద్రం పనులు పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



అసంపూర్తిగా నిలిచిన రైతు భరోసా కేంద్రం

అవిశ్వాసం వైపుగా..

(మొదటి పేజీ తరువాయి)

మరికొంతమంది బొత్స, చిన్నశ్రీను అనుచరులుగా ముద్ర పడినవారే కావడం గమనార్హం. అవిశ్వాస తీర్మానం పెట్టాలన్న డిమాండ్‌లో వారు కీలక పాత్ర పోషిస్తున్నారు.

● అవిశ్వాస తీర్మానం నెగ్గితే తర్వాత చైర్మన్‌గా పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు కావొచ్చునంటున్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడరుగా వ్యవహరిస్తున్న గెంబలి శ్రీనివాసరావు కూడా ఈ పదవి పట్ల ఆసక్తితో ఉన్నారు. సామాజిక వర్గం సమీకరణాలకు సంబంధించి తర్జనభర్జనలు జరుగుతున్నాయి. వైస్‌చైర్మన్ పదవుల విషయంలో ఎటూ తేల్చుకోలేకపోతున్నట్లు తెలిసింది.

● ఈ నెల 29 న మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఆ సమావేశంలో చర్చకు సుమారు 50కి పైగా అంశాలను పేర్కొన్నారు. అయితే రాజకీయంగా ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో కౌన్సిల్ సమావేశం తీరుతెన్నులు ఎలా ఉంటాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

అవకతవకలు బట్టబయలు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటామని చెప్పారు. వేదికపై ఉన్న వైసీపీకి చెందిన మండల ఉపాధ్యక్షుడు కలుగజేసుకొని క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఆ గోడ పనులు సక్రమంగా జరిగినట్లు నిర్ధారించారని, అటువంటిది ఇప్పుడు బీటలు వారాయని చెప్పడమేంటని అభ్యంతరం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది.

● మరికొన్ని గ్రామాల్లో బినామీ మస్తర్లు, దొంగ మస్తర్లు బయట పడ్డాయి. మస్తర్లలో దిద్దుబాట్లు, కొట్టివేతలను అధికారులు గుర్తించారు. దీనిపై నిలదీస్తే ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంపై ఏపీడీ అసంతృప్తి వ్యక్తం చేశారు.

● జయతి సచివాలయానికి తలుపులు, విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు, ఏర్పాటు చేయకుండా బిల్లు డ్రా చేసినట్లు డీఆర్‌పీ నివేదించారు. పంచాయతీరాజ్ అధికారులు సోషల్ ఆడిట్‌కు సహకరించని విషయాన్ని ఏపీడీ దృష్టికి రాగా ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఇంకా మరికొన్ని పథకాల్లో కూడా అవకతవకలను గుర్తించిన ఏపీడీ పద్మజ దీనిపై ప్రాజెక్టు డైరెక్టర్‌కు నివేదిక అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి, ఎంపీపీ సన్యాసినాయుడు, ఏపీవో చినప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

● ప్రాజెక్టు డైరెక్టర్ వస్తున్నట్టు సమాచారం అందడంతో రెండ్రోజులుగా ఉరుకులు పరుగులు తీసిన స్థానిక అధికారులు అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఫ్రీహోల్డ్ పనిపడుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం లేనందున అప్పుగా ఇచ్చినట్లు కాగితాలు రాయించుకున్నారు. అమ్మిన రైతులు ఎవరైనా తిరగబడితే వాటిని చూపి నోరు నొక్కేసేవారు. ఇలాంటి వారందరికీ గత వైసీపీ ప్రభుత్వంలో కలిసొచ్చింది. అప్పటి ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ భూములకు యాజమాన్య హక్కులు కల్పించుకున్నారు. చట్టబద్ధత కల్పించుకొనేందుకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుండగానే ప్రభుత్వం మారింది.

రెవెన్యూ అధికారుల సహకారంతోనే..

అసైన్డ్ భూములు అసలైన రైతుల వద్ద లేవన్న విషయం అందరికీ తెలిసిందే. ఇరవై ఏళ్ల క్రితం అసైన్డ్ పొందిన రైతు ఇప్పటికీ అతని అను భవంలో ఉంటేనే ఫ్రీహోల్డ్‌కు అర్హులు. అప్పటి రెవెన్యూ అధికారులు ఈ నిబంధనను పాటించకుండా భూములను అమ్ముకొని వారి వద్ద కూలీగా వున్న అసైన్డ్ రైతుల పేరున తొలుత భూ యాజమాన్య హక్కులు కల్పించి, ఆ తర్వాత రిజిస్ట్రేషన్‌ల ద్వారా చట్టబద్ధత కల్పించేందుకు అవకాశం ఇచ్చారు.

లోతుగా ఆరా తీస్తున్న ప్రభుత్వం

ఫ్రీహోల్డ్ భూముల్లో వెంటవెంటనే రిజిస్ట్రేషన్ జరిగిన భూములను గుర్తించేందుకు ప్రస్తుత ప్రభుత్వం నడంబిగించింది. ఇలాంటి భూమి లెక్క తెలుసుకోవాలన్న ఆత్రుత అందరిలోనూ ఉంది. గత ఆరు నెలలుగా రెవెన్యూ అధికారులు వడపోతపడుతున్నారు. కలెక్టర్ కార్యాలయానికి నివేదికలు వెలుతున్నాయి. అయినా ఈ లెక్క ఇంతవరకు తేలలేదు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రిజిస్ట్రేషన్‌లు జరిగిన ఫ్రీహోల్డ్‌లో అక్రమ లెక్కను మాత్రమే బయటకు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములకు జరిగిన ఫ్రీహోల్డ్ వివరాల కోసం అంతా ఎదురు చూస్తున్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వీరఘట్టం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మేజర్ పంచాయతీలో పూర్తిస్థాయిలో తాగునీరు అందజేయాలని కోరుతూ స్థానిక మహిళలు పంచాయతీ కార్యాలయం ముందు గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మేజర్ పంచాయతీ అయినప్పటికీ గ్రామంలో పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదన్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదని, వీధుల్లో రోడ్లు గుంతల మయంగా మారాయన్నారు. అనంతరం పంచాయతీ ఇన్‌చార్జి ఈవో కోటేశ్వరరావు, ఎంపీడీవో బి.వెంకటరమణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర, నాయకుడు సింహాచలం పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



బాధితులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): యు.వెంకమ్మపేట గ్రామానికి చెందిన వారాడ ఇందిరమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.88,652 చెక్కును ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గురువారం అందించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

గుమ్మలక్ష్మీపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి కోవెలవీధిలో ఉంటున్న ఒంటరి మహిళ ముగడ జయమ్మ ఇల్లు బుధవారం అగ్ని ప్రమాదానికి గురయ్యింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ఘటనా స్థలానికి వెళ్లి బాధితురాలికి పరామర్శించారు. 25 కిలోల బియ్యం, నగదు, నిత్యావసర సరుకులను అందించారు. ఆమె వెంట తహసీల్దార్ శేఖర్ ఉన్నారు.



బాధితురాలికి సాయం అందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

నేలబావే దిక్కు

● రక్షిత తాగునీటి పథకం లేని నారంనాయుడువలస
● అవస్థలు పడుతున్న గ్రామస్థులు

బలిజిపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామస్థుల తాగునీటి అవసరాలకు నేలబావే దిక్కు.. వారి పూర్వికుల నుంచి ఇప్పటి వరకూ ఆ గ్రామంలో తాగునీటి రక్షిత పథకమే లేదు. ఇదీ బలిజిపేట మండలానికి శివారులో ఉన్న నారంనాయుడువలస గ్రామం పరిస్థితి. గ్రామంలో సుమారు 1,300 మంది నివసిస్తున్నారు. వీరంతా రక్షిత తాగునీటి పథకం లేక పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామంలో ఉన్న నేల బావిపైనే ఆధార పడుతున్నారు. కలుషితమైన నీటిని తాగడంతో రోగాల బారిన పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రక్షిత తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని అధికారులకు విన్నవించుకున్నా ఎలాంటి ఫలితం లేదని వారు ఆందోళన వ్యక్త చేస్తున్నారు. వేసవిలో తమ పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందన్నారు. గ్రామంలో ప్రభుత్వ చేతి పంపులు ఉన్నా వాటిలో కొన్ని సక్రమంగా పనిచేయడం లేదన్నారు. అధికారులు స్పందించి తమ గ్రామానికి రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరు చేసి, కుళాయిలు ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే నారంనాయుడువలసలో పనులు ప్రారంభించి ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తాం.

- పవన్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



నేలబావి నుంచి నీటిని తోడుతున్న మహిళలు

రేపు బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

బొబ్బిలి రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు నిమిత్తం ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీవో పి.రవికుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తుదారులు దరఖాస్తు ఫారంతో పాటు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావలని తెలిపారు. ఉదయం 10 గంటలకు అలజంగి, సీహెచ్ బొడ్డవలస, చింతాడ, దిబ్బగుడ్డివలస, గోపాలరాయుడుపేట, జగన్నాథపురం, కలవరాయి, కమ్మవలస, కారాడ, కాశిందొరవలస గ్రామాలకు చెందిన వారికి, మధ్యాహ్నం 2 గంటలకు కోమటిపల్లి, ఎం.బూర్జవలస, మెట్టవలస, పక్కి, పారాది, పెంట, పిరిడి, రంగరాయపురం, శివడవలస గ్రామాలకు చెందిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు.

నేడు రామభద్రపురంలో..

రామభద్రపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ, ఈబీసీ కార్పొరేషన్ల రుణాల కోసం శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రత్నం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్‌తో పాటు అన్ని ధ్రువపత్రాల జిరాక్సులను తీసుకుని 10 గంటలకు హాజరు కావాలన్నారు.

వడ్రంగుల సమస్యలను పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వడ్రంగి సంఘం నాయకులు

బొబ్బిలి రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వడ్రంగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం బొబ్బిలి అసోసియేషన్ అధ్యక్షుడు జి.నారాయణరావు కోరారు. వండ్రంగుల దినోత్సవం సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో పలువురు వడ్రంగులు గురువారం స్థానిక తహసీల్దార్ ఎం.శ్రీనును తన కార్యాలయంలో కలిశారు. పనిముట్లు కొనుగోలుకు నిధులు మంజూరు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రాయితీలు ఇవ్వాలని, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడు జి.చక్రధర్, కార్యదర్శి పి.సత్యానా రాయణ, కోశాధికారి పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోశాలల నిర్మాణంపై విచారణ

బాడంగి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పిండ్రంగివలస గ్రామంలో గోశాలల మంజూరుపై ఇటీవల ఆ గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో ఏపీవో విజయలక్ష్మి గురువారం ఆ గ్రామంలో విచారణ నిర్వహించారు. పలువురు గ్రామస్థులు పాల్గొని.. తమ గ్రామంలో 11 మంది గోశాలలకు దరఖాస్తు చేస్తే కేవలం రెండే ఇచ్చారని తెలిపారు. అది కూడా అనర్హులకు ఇవ్వడం ఏంటని వారు ఆమెను ప్రశ్నించారు. ఆమె స్పందిస్తూ మండలంలోని ప్రతి గ్రామానికి రెండు ఇచ్చామని చెప్పారు. పక్కనే ఉన్న పెదపల్లి గ్రామానికి 28 ఇచ్చి, తమ గ్రామానికి 2 ఇవ్వడం ఏమిటని గ్రామస్థులు అడగ్గా.. ఆమె సమాధానం ఇవ్వలేదు. సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ తీర్మానం చేసి ఇచ్చినా అధికారులు ఇష్టారాజ్యంగా ఇచ్చుకున్నారన్నారు. ఫిర్యాదు చేసిన రౌతు సురేష్.. అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విచారణలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సత్యవతి, పాల్గొన్నారు.

రోడ్డు విస్తీర్ణానికి సహకరించాలి

రామభద్రపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బైపాస్ నుంచి కాంప్లెక్స్‌కు వెళ్లే రోడ్డు విస్తీర్ణం కార్యక్రమానికి ప్రతిఒక్కరూ సహకరించాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, ఆర్‌అండ్‌బీ జేఈ ప్రణయ, ఎస్‌ఐ వెలమల ప్రసాద్‌ల సమక్షంలో వ్యాపారులతో చర్చించారు. రోడ్డుకు అటువైపు, ఇటువైపు 15 అడుగులమేర ఆక్రమణలు తొలగించాలని ఈసందర్భంగా సూచించారు. ఈ వెడల్పు కార్యక్రమ పనులు వెంటనే చేపట్టాలని, లేకపోతే తామే జేసీబీలు పెట్టి ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. గత కొన్నేళ్లుగా రోడ్లు ఆక్రమణలు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జనాభా పెరుగుదల దృష్ట్యా రోడ్డు వెడల్పు చేయాల్సిన ఆవశ్యకత ఉందని సీఐ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

బొబ్బిలిలో ఉగాది ఉత్సవాలు

బొబ్బిలి/రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి శ్రీకళాభారతి ఆడిటోరియంలో 30వ తేదీ ఆదివారం ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు ప్రధాన కార్యదర్శి నంబియలర్ వేణుగోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే బేబీనాయన ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ

బొబ్బిలి రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పొట్నూరు గణపతిరావు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గుండెకు బైపాప్ సర్జరీ చేసుకున్న అనంతరం ఇంటికి తిరిగి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబీనాయన గురువారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రౌతు రామమూర్తినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రౌతు తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

కో-ఆప్షన్ సభ్యురాలిగా షేక్ హయత్‌బీబీ

సంతకవిటి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కో-ఆప్షన్ సభ్యురాలి ఎన్నికను నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన షేక్ హయత్‌బీబీని కో-ఆప్షన్ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. ఆమెకు మండల ప్రత్యేక అధికారి ఎ.సోమేశ్వరరావు, ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ ధ్రువపత్రాన్ని అందజేశారు.

లక్ష్యాలను చేరుకుంటాం

పార్వతీపురంటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల లక్ష్యాలను చేరుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మున్సిపాల్టీలోని 30 వార్డుల్లో ఇంటి పన్నుల వసూళ్లకు సంబంధించి ఆయన గురువారం ప్రత్యేక పర్యవేక్షణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25కి గాను ఇంటి పన్నుల లక్ష్యం రూ.5.57 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.4.37 కోట్లు వసూలు చేశామని, ఇంకా మిగిలిన మొత్తాన్ని వసూలు చేసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మార్చి 31వ తేదీ లోగా ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను చెల్లించే యాజమానులకు 50 శాతం వడ్డీ మాఫీ చేస్తామన్నారు. ● అన్నా క్యాంటీన్ల ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

పాలకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాలు, కార్పొరేషన్‌లో ఉన్న అన్ని విభాగాలు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికు లందరికీ పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీ స్ యూనియన్ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ.. ప్రభుత్వాన్ని డిమాం డ్ చేసింది. ఈ మేరకు మార్చి 31 వరకు జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమా లకు సంబంధించి కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

గరుగుబిల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని నాగురు ఎంపీటీసీ సభ్యుడు, టీడీపీ అరకు పార్లమెంటరీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ సూచించారు. గురువారం చిలకాం పంచాయతీ పరిధిలో మహిళా సంఘాలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రూపులకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం సీఆర్పీల నియామకం చేపడుతోందని తెలిపారు.

సాగునీరు విడుదల చేయాలి

బొబ్బిలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి కుడికాలువ ద్వారా బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని తెర్లాం ప్రాంత రైతులకు సాగునీటిని విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు, మండల కన్వీనరు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెర్లాం ప్రాంతం మీదుగా కాలువ వెళ్తున్నా ఆ ప్రాంత రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందని రైతులంతా ఆవేదన చెందుతున్నారన్నారు. కుడికాలువ నుంచి నతివాడ లింగయ్య చెరువుకు ఈ నీటిని అందిస్తే సుమారు 1500 ఎకరాల భూముల సాగుకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ పిల్లకాలువకు కేవలం రూ.5లక్షలు మాత్రమే ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారన్నారు. రైతులకు ఎంతో లబ్ధిని చేకూర్చే ఈ ప్రతిపాదన పట్ల ఎమ్మెల్యే బేబీనాయన చొరవ తీసుకుని రైతుల సాగునీటి అవసరాలను తీర్చాలని కోరారు. అధికారులు స్పందించకపోతే రైతుల తరఫున ఉద్యమిస్తామని వారు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వండి

బొబ్బిలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక పాకీ వీధిలో సంతకాల సేకరణ నిర్వహించారు. పారిశుధ్య కార్మిక వ్యవస్థకు సంబంధించిన ఆప్కాస్ సంస్థను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించవద్దని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ నిర్వహించిన సంతకాల సేకరణ పత్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మున్సిపల్ శాఖా మంత్రి నారాయణకు పంపిస్తామని ఆయన తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు గౌరీ, జె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ నిర్వహిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

పాఠశాల సందర్శన

బొబ్బిలి రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పిరిడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు గురువారం సందర్శించారు. ముందుగా విద్యార్థుల హాజరు పట్టీని తనిఖీ చేశారు. పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, పలు సూచనలు ఇచ్చారు. కిచెన్ గార్డెన్, మరుగుదొడ్ల వినియోగం బాగుందని సిబ్బందిని అభినందించారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి

బాడంగి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బకాయి ఉన్న పది వారాల ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎ.సురేష్ డిమాండ్ చేశారు. గురువారం బాడంగిలోని ఉపాధి పనులను ఆయన సందర్శించారు. కూలీల వేతనం రోజుకు రూ.300 లు గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. భవిష్యత్తులో రెండు పూటల పని పెడితే ఉపాధి కూలీలను ఏకం చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జీఎస్టీ అధికారిగా అభిలాష్

బాడంగి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బాడంగి గ్రామానికి చెందిన అభిలాష్ అనే యువకుడు జీఎస్టీ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. వంగపండు శ్రీనివాసు, తెంటు వెంకటలక్ష్మి దంపతుల మొదటి కుమారుడు అభిలాష్ ఇటీవల జరిగిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్‌లో 390 మార్కులకు గాను 254 మార్కులు సాధించి, ఆలిండియా ఓబీసీ కేటగిరిలో 640వ ర్యాంకు సాధించి సెంట్రల్ జీఎస్టీ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు.

రామభద్రపురం మార్కెట్ వేలం

రామభద్రపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రామభద్రపురం కూరగాయల మార్కెట్ వేలంపాట గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ.శ్రీనివాసరావు సమక్షంలో నిర్వహించారు. పూడి సూర్యనారాయణ అనే వ్యక్తి రూ.40లక్షల 92వేల 300లకు పాడి, పాట దక్కించుకున్నారు. గతేడాది కూడా ఈయనే ఈ వేలంపాట దక్కించుకున్నారు. సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు అధ్యక్షత వహించగా, పంచాయతీ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.